# ఉదయించని ఉదయం!




"వోరే తంబీ! స్కాచీ. గీచీ నీ కళ్ళకి ల్లేక పోతే. కనీసం వో గ్లాసు బీరన్నా తీసుకోరా. నలుగురి మధ్యా నువ్వట్లా నచికేతుడిలా కూచుంటే నీ ఫ్రెండ్సుమని చెప్పుకోడానికి మాకు నగుబాటుగా వుందిరా!" అంటూ వీలయినంత దీనత్వాన్ని కంఠంలో తెచ్చిపెట్టుకుంటూ అడిగాడు కురంగేశ్వర్రావ్. అతనికి వంత పాడారు అక్కడ పార్టీలో కూచున్న మిగిలినవాళ్ళు. అప్పటికే కొందరు రెండో రౌండ్ పూర్తి చేసి మూడో రౌండ్‌లోకి వెళ్ళిపోయారు. ఒకళ్ళిద్దరు గుర్రమెక్కేశారు. వాళ్ళకెదురుగా వున్న ప్లేట్లలో చిప్స్. వేరుశెనగ పప్పు. జీడిపప్పు. ఎన్ని ప్యాకెట్లు తెచ్చి పెట్టినా పంటి కిందికి చాలడంలేదు. ఖాళీ అయిన స్పెన్సర్ సోడాలు బల్లల కింద అటూ ఇటూ దొర్లుతున్నాయి రక రకాల సిగరెట్ల పొగలు వెగటుగా కలసిపోయి. వాతావరణానికి కిక్కిస్తున్నాయి.

కురంగేశ్వర్రావ్ మాటలు విన్న ఆనందరావ్ నలుగురి వేపూ చూశాడు. "నాకూ తాగాలనే వుంది బ్రదర్!" అన్నాడు.

"అయితే ఇంకేం. కొట్టేయ్ ఓ పెగ్గు-వదిలేసేయ్ నీ సిగ్గు" అన్నాడు మరో స్నేహితుడు. ఎంగిలి మాటలను నాలిక చివర అంటించుకుంటూ. ఆనందరావ్ గంభీరంగా అన్నాడు. "తప్పకుండానూ! అయితే ప్రతి దానికీ ఓ అకేషనుండాలిగదా! ఇవ్వాళ మనం ఈ పార్టీలో కూచున్నామంటే కురగం గాడికి సెలెక్షన్ వచ్చింది కాబట్టి!

## కొండముది శ్రీరామచంద్రమూర్తి

అవునా? మొన్న తారకం పెళ్ళికి వాడు పార్టీ ఇచ్చాడు మనం పుచ్చుకున్నాం. కిందటినెల సభాపతి పి. హెచ్.డీ పుచ్చుకున్నాడు. ఆ ఈవెంట్‌ని సెలిబ్రేట్ చేసుకున్నాం మనం. అంచేతా...." అంటూ ఆగిపోయాడు.

"చెప్పు. చెప్పు. నీ విషయంలో ఏం జరగాలి?" మైకేల్ అడిగాడు కుతూహలంగా.

"వాడి విషయంలో ఏం జరగడానికీ ఏ అవకాశం లేదే?" కురంగేశ్వర్రావ్ అన్నాడు నిరాశగా. వాడికి పెళ్ళయి ఆరేళ్ళయింది. ఇప్పుడా పాత పెళ్ళికి కొత్త పార్టీ ఇవ్వడు. పిల్లలుపుట్టి నాలుగేళ్లయింది. కాన్వెంటులో చేరిన పిల్లలకు. అసలే తడిసి మోపెడై వాడుంటే ఇప్పుడేంపార్టీ చేస్తాడు? పోనీ పుట్టినరోజునాడన్నా గొంతు తడుపుతాడేమో అంటే ఆ ఆశేం లేదు వాడి పుట్టిన రోజు ఫిబ్రవరి ఇరవై తొమ్మిది కావడంతో అది నాలుగేళ్ళకోసారి గాని రాదు.

ఆనందరావ్ తన స్నేహితుణ్ని ఆపాడు- "అవ్వేం అక్కర్లేదు నేను మీతో కలవడానికి. రోజూ జరిగే సంఘటనలు. మనం సర్వ సాధారణం అనుకుంటున్న అసాధారణ. దారుణసంఘటనలు. హత్యలు. రేప్‌లు లూటీలు. ఆడపిల్లల్ని కట్నంకోసం చంపడాలు. యాక్సిడెంట్‌లు. ఇటువంటి వాటిల్లో ఏ వొక్కటైనా లేకుండా ఏ ఒక్క రోజు గడిచినా. గడచినట్లు ఏ న్యూస్ పేపరు ప్రకటించినా. ఆ రోజును నేను గ్రాండ్‌గా సెలిబ్రేట్ చేసుకుంటాను. బ్రదర్స్! సంతోషంగా మీ కందరికి స్కాచ్ విస్కీ తాగిస్తాను. నేను కూడా బీరు పుచ్చుకుని. మీకందరికీ సంతోషం కలిగిస్తాను!"

మైకేల్ ఆలోచనలో పడ్డాడు. "తాగడం తప్పించుకోడానికి తెలివైన ప్రపోజల్ తంబీ!" అన్నాడు.

కురంగేశ్వర్రావ్ కూడా ఆశ వదులుకున్నాడు. "మందు పుచ్చుకోడం ఇష్టం లేకపోతే ఆ సంగతి స్పష్టంగా చెప్పొచ్చు కదు గురూ!- ఈ డొంక తిరుగుడెందుకూ?" అన్నాడు చిరుకోపంగా.

మరో రెండు రౌండ్లయింతర్వాత ఆ మిత్రులందరూ తూలుకుంటూ. తుళ్ళుకుంటూ. వాహాళ్ళమీద ఒహాళ్ళు సోలిపోతూ. బార్‌లో నుంచి బయటపడి టాటా చెప్పుకున్నారు. వాళ్ళను రిక్షాల్లో కుదేసి. జాగర్తలు చెప్పి. తన మోపెడ్ మీద ఇంటికి వచ్చేశాడు ఆనందరావ్.

ఇంటికి వచ్చినా. బార్‌లో జరిగిన డిస్కషన్ తాలూకు హేంగ్‌ఓవర్ అతణ్ని వదిలిపెట్టలేదు. తాగడం తప్పించుకోడానికి తనట్లా అన్నా. నిజంగా ఈ దేశంలో ఒక్క రోజన్నా. కనీసం ఒక్కరోజన్నా. ఏ దుఃఖ వార్తా ఉండకుండా వుండదా? అందరూ హాయిగా రెండు పూటలా తిండి తిని. కంటినిండా నిద్రపోయే రోజు ఒక్కటన్నా ఉండదా? అందరూ వంటి నిండా బట్ట కట్టుకుని. ఎండకూ. చలికీ భయపడకుండా. హాయిగా రోడ్లమీద తిరిగేరోజు ఒక్కటైనా వుండదా?

ఏ ఆడపిల్లా. అత్తా ఆడబిడ్డల ఆరళ్ళకు గురై కట్టుకున్న వాడి స్వార్థానికి బలై అర్థాంతరంగా కన్నుమూసే. అభాగ్యస్థితి ఏ ఒక్క రోజన్నా లేకుండా వుండదా? అట్లా వున్న ఆ రోజు ఈ దేశ చరిత్రలోనే ఒక బంగారు దినం అవుతుంది. కానీ అటువంటి మంచిరోజు రహిస్తుందా?

ఇన్నికాదు. కనీసం ఇందులో ఏ ఒక్కటన్నా లేనిరోజు ఒక్కటన్నా వుంటుందా? ఆనందరావు ఆలోచనలో పడ్డాడు. దేనికోసం తను ఎదురు చూడాలి? ఆర్తులు లేని రోజు కోసమా? అన్నార్తులు లేని దినం కోసమా? ఉహూ! వాటి కోసం కాదు. ఆడబిడ్డలు కన్నీళ్ళు కార్చని శుభదినం కోసం! కట్న రక్కసి కోరలకు చిక్కకుండా. భర్తృ పరిష్వంగంలో కుల వధువు అంతర్వత్నిగా మురిసి మైమరచే మంచి రోజు కోసం!! ఆ విధంగా అనుకుని ఆనందరావ్ ప్రతి రోజూ. పొద్దున్నే కాఫీ తాగుతూ. దిన పత్రిక పుటలన్నీ భూతద్దంతో వెతికినట్టు. వెతకడం మొదలెట్టాడు. అయితే ఏ రోజూ అతని ఆశ నెరవేరలేదు పత్రికలో ఎక్కడో ఓ చోట. ఓ దుర్భర దురంత విషాద వార్త వుండేది. మానవతుల శీలాన్ని దోచుకున్న వార్తలకుతోడు పుణ్యవతి పసుపు కుంకుమల్ని మంటగలిపిన మృగ రాక్షసుల మంకుతనం. మూర్ఖత్వం. అహంకారం. వీటిని గూర్చిన వార్తలుండేవి. ఒక రోజున అతను పేపరంతా గాలించాడు. ఏవేవో వార్తలున్నాయి అక్కడో యుద్ధం ఇక్కడో శాంతి ప్రవచనం. అంతరిక్షంలోకి వెళ్ళడానికి అగ్రరాజ్యాల తహతహ.... ఇలాతలంలో హేమం పిండలేక చిన్న రాజ్యాల నిరీహ....ఎన్నికల రణరంగంలో ఉన్నతుల ఔద్ధత్యం. ఏ పుటలోనూ ఆ రోజున "బ్రైడ్ బర్నింగ్" కేసుల వార్తే లేదు. ఏ కాలమ్‌లోనూ ఏ అభాగ్యురాలి కన్నీటిగాథ వివరణమూ లేదు. పేపరంతా స్వచ్ఛంగా వుంది. పుటు కడిగిన ముత్యంలా వుంది. ఆనందరావ్ హృదయం ఆనందతరళాయితం అయింది. నిజంగా ఎన్నినాళ్ళకు, ఎన్నినాళ్ళకు ఒక్క మంచి ఉదయం నవ్వుతూ ఉదయించిందీ అనిపించింది.

ఆనందరావ్ వెంకటయ్యను తన ఇంటిలోకి తీసుకు వెళ్ళాడు. పార్లర్‌లో కూచోపెట్టాడు. ఫ్రిజ్‌లో నుంచి రెండు బీర్ సీసాలను తీసుకువచ్చి టీపాయ్ మీద పెట్టాడు. ఓ సీసా మూత తీయడానికి ప్రయత్నం చేస్తూ. "త్రీ చీర్స్ టు ది హెల్త్ ఆఫ్ అవర్ ఇండియన్ విమెన్!" అన్నాడు సంతోషంగా.

వెంకటయ్యకు అదేమీ అర్థం కావడం లేదు. "ఏం విటాస్పర్ విశేషం?" అన్నాడు గోల్డెన్ ఈగిల్‌ను తనూ అందుకుంటూ.

"ఇవ్వాళ కన్నీళ్ళు లేవు. కాలిపోవడాలు లేవు. కట్నంకోసం హత్యల్లేవు. కన్నెపిల్లల కడగళ్ళు లేవు. చూడండి సార్ ఈ పేపర్ని- ఎంత హాయిగా వుందో!"

వెంకటయ్య ఆ మాటలకు పెద్దగా రియాక్ట్ కాలేదు. "ఉహూ!" అన్నాడు. బీర్ సీసా మూత తీసి. సీసాతోనే తాగబోయాడు.

"వెంకటయ్యగారూ....వెంకటయ్యగారూ..." బయటి నుంచి పెద్దగా. కంగారు కంగారుగా కేకలు. "రావాలి రావాలి తొందరగా మీరు మీ ఆవిడ కాలిపోతోందండీ! కిర్సనాయిలు వంటి మీద పోసుకుని అంటించేసుకుందండీ!"

ఆనందరావ్ సీసా కింద పడిపోయింది. వెంకటయ్య దిగ్గున లేచాడు. "డెవిల్.... దయ్యం .... రాక్షసి .... అన్నంత పనీ చేసింది." అంటూ ఇంటి వేపుగా పరుగెత్తాడు. అతన్ని అనుసరించాలని కూడా అనిపించలేదు ఆనందరావ్‌కు. నేల మీదపడ్డ సీసాలోంచి అతని కాళ్ళమీదకు ప్రవహిస్తోంది తెల్లని తరగల్తో చల్లగా వున్న బీరు!